క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న దాతలు

భీమారం: మండల కేంద్రానికి చెందిన అమరగాని మౌనిక అనాథ విద్యార్థి చదువు కోసం దాతలు ఆదివారం నగదు సాయం చేశారు. అమరగాని మౌనిక తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో బంధువుల ఇంట్లో ఉంటూ చదువుకుంటుంది. 10వ తరగతి పూర్తిచేసుకొని ఇంటర్మీడియట్ చదువుతున్న మౌనిక గురించి తెలుసుకున్న మండల సహకార సంఘం డైరెక్టర్ పానుగంటి లక్ష్మణ్ రూ.3వేలు, అభయరామన్ సొసైటీ డైరెక్టర్ బూపల్లి లక్ష్మణ్ రూ.2500 మౌనికకు అందజేశారు. ఆమె ఉన్నత విద్యకి అవసరమైన ఖర్చులు తామే భరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఇందులో సభ్యులు మెండె మల్లేశ్, సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలల్లోకి రావొద్దనటం సరికాదు'

మంచిర్యాలఅర్బన్: అనుమతి లేకుండా పాఠశాలల్లోకి రావొద్దనటం సరికాదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సల్మాన్ అన్నారు. విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలను నిషేధ నిర్ణయాలను ప్రభుత్వ ఉన్నతాధికారులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

బెల్లంపల్లి(కాసిపేట): పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధానకార్యదర్శి ఎల్తూరి శంకర్ ఒక ప్రకటనలో కోరారు. రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులు పస్తులతో కాలం గడుపుతున్నారని, ప్రతి కార్మికుడికి రూ.ఐదువేల చొప్పున సహాయం అందించాలని కోరారు.

ఐక్యతపై అవగాహన సదస్సు

కాసిపేట: ఆదివాసీలు ఐక్యతతో ముందుకు సాగుతూ, చదువుపై దృష్టి సారించాలని ప్రజాసంఘాల నేతలు, వక్తలు శ్రీమన్నారాయణ, మడావి శంకర్, రోడ్డ గోపాల్, సమ్మయ్య, పల్లె మల్లయ్య సూచించారు. మండలంలోని మల్కేపల్లిలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివారం ఆదివాసీల స్థితిగతులు, ఉనికి, హక్కులు, ఐక్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివాసీలు నేడు హక్కులు కోల్పోవడానికి ప్రధాన కారణం ఐక్యత లోపించడమేనన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడ జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెడ్మ కిషన్, నాయక్‌పోడ్ సేవాసంఘం మండలాధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, ఆదివాసీలు తదితరులున్నారు.

బీసీ హాస్టల్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి

పాతమంచిర్యాల: బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని వర్కర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తమకు 10నెలల నుంచి వేతనాలు చెల్లించడంలేదని, సదరు అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్‌ను అడిగితే బడ్జెట్ రాలేదని సమాధానమిస్తున్నారన్నారు. వేతనాలు రాక తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ వర్కర్లు మెహర్‌బాబా, శ్రీవిద్య, నర్సింహులు, పద్మ, సత్యం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ ఉన్నారు.

వంతెనకు మరమ్మతులు



మరమ్మతు చేయిస్తున్న నాయకులు

నెన్నెల: భారీ వర్షాలకు శిథిలావస్థకు చేరిన ఎర్రవాగు వంతెనపై ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు మరమ్మతులు చేపట్టారు. ఎనిమిది గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాన్ని కల్పించారు. స్థానిక నాయకులు తమ సొంత ఖర్చులతో సిమెంట్, కంకరను ఉపయోగించి గుంతలను పూడ్చివేసి మన్నెగూడం, లంబాడితండా, కోణంపేట, జంగాల్‌పేట ప్రజలకు రవాణా కష్టాలు తొలగించారు. గుంతలు పూడ్చిన వారిలో మండల బీఆర్ఎస్ నాయకులు ఇబ్రహీం, సాగర్‌గౌడ్, సర్పంచ్ బాపు, జెడ్పీటీసీ రాంచందర్ తదితరులు ఉన్నారు.

కొమ్మ కదిలిందా.. కరెంటు గోవిందా..!



తిలక్‌స్టేడియం వెనకాల చెట్ల కొమ్మల మాటున కరెంట్ తీగలు ఉన్నాయి. కొమ్మల రాపిడి వల్ల తీగలు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశాలు ఉన్నా, కనీస చర్యలు తీసుకోవడం లేదు.



విద్యుత్ స్తంభాన్ని చుట్టుకుని, తీగలకు చేరువలో పిచ్చి మొక్కల కొమ్మలు వేలాడుతున్న ఈ ఫొటోలోని దృశ్యం సోత్‌త్రాస్కట్ ఇందిరమ్మకాలనీకి వెళ్లే మార్గంలో ఉంది. ఇంకాస్తా కొమ్మలు పైకి ఎగబాకడానికి సిద్ధంగా ఉన్నాయి. కొమ్మల వల్ల కరెంట్ సరఫరాకు ప్రతిబంధకం కావడానికి అవకాశాలు ఉన్నా చర్యలు చేపట్టడం లేదు.



ఈ ఫొటోలో ఉన్న దృశ్యం ప్రగతి కళాశాల నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలోనిది. విద్యుత్ స్తంభాన్ని అల్లుకుని తీగజాతి చెట్టు కొమ్మలను తాకుతోంది. దీనివల్ల కరెంట్ సమస్యలు ఏర్పడే అవకాశాలు ఉన్నా మీనమేశాలు లెక్కిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు చెట్ల కొమ్మలు ప్రతిబంధకంగా మారాయి. కరెంట్ తీగలను ఆనుకుని ఉన్న కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించాల్సి ఉండగా, తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. ఏటా మొక్కుబడిగా కొమ్మలు కత్తిరించి వదిలేస్తుండటంతో మళ్లీ కొమ్మలు చిగురించి కరెంట్ తీగలపై కలుపుకుంటున్నాయి. ఈ కారణంగా వర్షాకాలంలో కరెంట్ సరఫరాకు ఆటంకం కలుగుతోంది. గంటల కొద్ది అనధికారికంగా విద్యుత్ సరఫరాను నిలిపి వేయాల్సిన ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



వన్‌టౌన్ పోలీసు క్వార్టర్ల ఎదుట చెట్లకొమ్మల మాటున విద్యుత్ తీగలు

- తీగలను ముద్దాడుతున్న చెట్లు..
- తొలగింపుపై బల్దియా నిర్లక్ష్యం
- పట్టణ ప్రజలకు తప్పని విద్యుత్ కష్టాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కరెంట్ కటకటను పుర ప్రజలు అనుభవిస్తున్నారు. చిరుగాలి వీచినా, వానజల్లు కురిసినా కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో కార్మిక వాడలు, కార్మికేతర ప్రాంతాలు ఉన్నాయి. వీటికి సింగరేణి, డిస్కం వేర్వేరుగా కరెంట్ సరఫరా చేస్తున్నాయి. కార్మిక వాడల్లోని క్వార్టర్లకు సింగరేణి కంపెనీ ప్రైవేట్ ఇళ్లకు డిస్కం ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. అయితే ఏటా అటు సింగరేణి క్వార్టర్లకు, ఇటు ప్రైవేట్ ఇళ్లకు వర్షాకాలంలో విద్యుత్ సమస్య వినియోగదారులకు తలనొప్పిని కలిగిస్తున్నాయి. గృహావసరాలకు సరఫరా చేస్తున్న విద్యుత్ తీగలకు అడ్డంకిగా చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి అవరోధం కలిగిస్తున్నాయి. ఏమాత్రం గాలి దుమారం వీచినా, వర్షం కురిసినా వెంటనే కరెంట్ పోతోందని విద్యుత్ వినియోగదారులు చెబుతున్నారు. ఆ తర్వాత సంబంధిత విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణ చేసి, అడ్డుగా ఉన్న కొమ్మలను నరికి వేశాక కానీ కరెంట్ సరఫరా పునఃరుద్ధరణ కావడం లేదు. అప్పటివరకు గంటల కొద్ది కాలం విద్యుత్ సరఫరా కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు అనివార్యమవుతున్నాయి.

కొమ్మలతో అనర్థాలే ...

చెట్ల కొమ్మలు కరెంట్ సరఫరాకు అన్ని విధాల అనర్థదాయకమే. కరెంట్ తీగలపై కొమ్మలువాలడం, బలంగా పడటం వల్ల ఆ కరెంట్ ట్రిప్ అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్య ఏర్పడుతుంది. తీవ్రత అధికమైతే ఏకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయే అవకాశాలు ఉంటాయి. కొమ్మల ధాటికి తీగలు కింద పడిపోయి ఒక్కోసారి ప్రాణనష్టం జరిగే అవకాశాలు లేకపోలేదు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం వల్ల డిస్కంకు దాని సామర్థ్యాన్ని బట్టి కనిష్టంగా రూ.70వేల నుంచి గరిష్టంగా లక్షకు పైగా ఆర్థిక కష్టం కలుగనుంది. పశువులు, మానవులకు ప్రాణనష్టం జరిగితే పరిహారం రూపంలో మరింతగా ఆర్థిక భారం పడనుంది. అంతగా నష్టం కలిగించే అవకాశాలు ఉన్నా, కొమ్మల నరికివేత విషయంలో మాత్రం విద్యుత్ అధికారులు సరిగా స్పందించలేకపోతున్నారు.

నరికివేత చర్యలు అంతంత మాత్రమే...

మున్సిపాలిటీలోని ఏ వార్డులో చూసినా విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు తాకుతూ దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల చెట్ల మధ్యలో నుంచి 11కేవీ, త్రీ ఫేజ్ విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. రెగ్యులర్‌గా ప్రతి సంవత్సరం కొమ్మల నరికివేత ప్రక్రియను నిర్వహించడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తుండటంతో కరెంట్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సింగరేణి, డిస్కం విద్యుత్ విభాగం అధికారులు సానుకూలంగా స్పందించి కొమ్మల నరికి వేత చర్యలను క్రమం తప్పకుండా చేపట్టి కరెంట్ కష్టాలు ఏర్పడకుండా చూడాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొమ్మలు నరికి వేయిస్తున్నాం

విద్యుత్ తీగలకు వేలాడుతున్న, ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికి వేయించే చర్యలు ప్రారంభించాం. రోజువారీగా ఒక్కో ప్రాంతంలో కొమ్మల నరికివేత పనులు జరుగుతున్నాయి. కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగించే రీతిలో ఉన్న కొమ్మలను వదిలిపెట్టం. తొలగించే యత్నాలు చేస్తాం.

– బొంకూరి శ్రీనివాస్, డిస్కం ఏఈ, బెల్లంపల్లి టౌన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గోపాల్

పాతమంచిర్యాల: విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని నేతకాని స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల రాజకీయనాయకుల పిల్లలను ప్రభుత్వ బడులలోనే చదివించాలన్నారు. అప్పుడే ప్రభుత్వ బడులలో సౌకర్యాలు మెరుగుపడుతాయన్నారు. ఇటీవల జరిగిన డీఈవోల సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనా మీడియా సంస్థలు, విద్యార్థి సంఘాలను విద్యా సంస్థలలోనికి అనుమతించకూడదని ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదన్నారు. నేతకాని కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతకాని స్టూడెంట్ యూనియన్ నాయకులు గణపతి, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామానికి చెందిన 100మంది ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి జిల్లా కాంగ్రెస్ నాయకులు రాజారమేశ్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాజారమేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమఫలాలు ప్రకటనకే పరిమితమయ్యాయని, ప్రభుత్వవిప్ బాల్క సుమన్ పల్లెలను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. చెన్నూరు నియోజకవర్గంలో కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల రైతుల పంటలు ముంపునకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి(కాసిపేట)/నెన్నెల: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. పట్టణంలోని 5, 7, 8వార్డుల్లో రెండో విడతలో 287మంది లబ్ధిదారులకు ఆదివారం శాశ్వత ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని 26మంది మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, కోఆప్షన్ సభ్యుడు సాజిద్ వాజిద్, కౌన్సిలర్లు తారవాసు, లావణ్య, విజయ, తిరుమల, గెల్లి రాయలింగు, సురేష్, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, దామెర కిరణ్, శ్రావణ్, యూనుస్, రాజ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, సత్తయ్య, కాసిపేట మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, సర్పంచ్ స్వప్న, నెన్నెల మండల కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, సంభంధిత అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'ప్రజాసంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం'

తాండూర్: ప్రజాసంక్షేమ సుపరిపాలన బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మండలంలోని రేచిని గ్రామపంచాయతీలో ఆదివారం రేచిని నుంచి బల్హాన్ వరకు రూ.2.25కోట్లతో నిర్మించే రోడ్డు పనులు, కొత్తపల్లి, గోపాల్‌నగర్‌లలో రూ.20లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌నగర్‌కు చెందిన గిరిజనులు తమకు ఇళ్లు లేవని, ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా 15ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీలు సిరంగి శంకర్, మొగిలి శంకర్, సింగిల్‌విండో చైర్మన్ దత్తుమూర్తి, కో ఆప్షన్ సభ్యులు రహమత్, సర్పంచ్‌లు బక్కమ్మ, రజిత, దుర్గబాయి పాల్గొన్నారు.

'సదుపాయాల కల్పనలో ఎమ్మెల్యే విఫలం'



సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సరైన రోడ్లు, డ్రెయినేజీలు లేక, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే అయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పచ్చ వెంకటేశ్వర్లు, అర్నకొండ శ్రీనివాస్, గుర్రాల లావణ్య, మాసు రజిని, పట్టి వెంకటకృష్ణ, రాకేశ్ రెన్వా, పల్లి రాకేశ్, అమిరిశెట్టి రాజు, బింగి సత్యనారాయణ, మల్లేశ్, అశోక్ పాల్గొన్నారు.

'ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత'



మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

బెల్లంపల్లి(కాసిపేట): ప్రజా రక్షణే పోలీసుల బాధ్యతగా పోలీస్‌శాఖ వ్యవహరిస్తుందని బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని కన్నాలబస్తీలో ఆదివారం సాయంత్రం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. 50మోటార్ సైకిళ్లు, 5ఆటో రిక్షాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రమేశ్, శ్యాంపటేల్, రవికుమార్, రాజశేఖర్, 40మంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలు హామీలకే పరిమితం'

దండేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలు హామీలకే పరిమితమయ్యాయి తప్పా అమలుకావడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల్ల మల్లారెడ్డి ఆరోపించారు. దండేపల్లిలో పార్టీ నాయకులతో ఆదివారం సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసిగెత్తి పోతున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి ప్రభుత్వాన్ని గద్దెదించడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మున్నారాజ్, శ్రీనివాస్, నరేష్, కార్తీక్, అశోక్‌వర్ధన్, తిరుపతిరెడ్డి, భీమేష్, లక్ష్మణ్, మల్లేష్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కళ్లకలక కలవరం

- వసతి గృహంలో హెచ్‌ఎస్ లేక ఇబ్బందులు



గురుకులం గేటు వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

జైపూర్: గురుకులాల విద్యార్థులను కళ్ల కలక కలవరపెడుతోంది. 700మందికి పైగా ఉన్న వసతి గృహంలో ఏడాదిగా హెల్త్ సూపర్‌వైజర్(హెచ్‌ఎస్) లేకపోవడం విద్యార్థుల ఆరోగ్యాలపై ప్రభావం చూపిస్తోంది. అసలే వర్షకాలం ఆపై పలురకాల వ్యాధులతో విద్యార్థులు సతమతం అవుతోన్నప్పటికీ హెచ్‌ఎస్‌ను నియమించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జైపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో వారంరోజులుగా విద్యార్థులు కళ్లకలకతో ఇబ్బందులు పడుతున్నారు. మొదట ముగ్గురు, నలుగురికి కళ్లకలక రావడం, వారిని ముందుజాగ్రత్తగా ప్రత్యేక గదుల్లో ఉంచక పోవడంతో అది కాస్త వ్యాపించడంతో సుమారు 400మంది కళ్లకలకతో బాధపడగా స్థానిక జైపూర్ ఆస్పత్రి వైద్యాధికారి అనిల్‌రావు నేతృత్వంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇప్పుప్పుడే కోలుకుంటున్నారు. ఇంకా కొంత మంది విద్యార్థులు కళ్లకలకతో బాధపడుతుండగా, వారిని ప్రత్యేక గదుల్లో ఉంచారు. కళ్లకలక వచ్చిన వారికి కళ్లు ఎరుపుగా మారి, రాత్రులు సైతం నిద్రపట్టకా, అవస్థలు పడుతున్నట్లుగా విద్యార్థులు వాపోతున్నారు. పిల్లలను చూడటానికి వారి తల్లిదండ్రులు ఆదివారం వసతి గృహం వద్ద బారులు తీరారు. కాగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న బాలభాస్కర్ భారీ వర్షాల దష్ట్యా హెడ్‌క్వార్టర్లలోనే ఉండాల్సి ఉన్నప్పటికీ ఆయన సెలవులపై వెళ్లడం, పిల్లలు అనారోగ్యం భారినపడటంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా వసతి గృహంలో హెచ్‌ఎస్‌ను నియమించాలని కోరుతున్నారు.

స్తంభాలను ఉంచే రోడ్డేశారు..?



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డును ఇష్టారీతిన వేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న స్తంభాలను తొలగించకుండానే.. సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. రోడ్డు వెడల్పు కావడంతో వాహనాలు వేగంగా వస్తే, రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉండి, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెండు విద్యుత్ స్తంభాలను అలాగే ఉంచేసి, రోడ్డు వెడల్పు చేసి ఏడాది గడుస్తున్నా, ఆయా విద్యుత్ స్తంభాలను మాత్రం తొలగించడం లేదు.

మేరు సంఘం కార్యవర్గం

కోటపల్లి: మండల మేరు కులస్తుల నూతన కమిటీని మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు గట్ల చందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోటపల్లి మండల అధ్యక్షుడిగా పెండ్యాల బుచ్చన్న, ఉపాధ్యక్షుడిగా కిరణ్ ఎన్నికయ్యారు.

వేమనపల్లి: మండల మేరు సంఘం అధ్యక్షుడిగా పుల్లయ్యను ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు ఎన్న బాపు, పెండ్యాల శ్రీనివాస్, రాపర్తి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా రాపర్తి తిరుపతి, రామును ఎన్నుకున్నారు.

ఘనంగా గీతా హవన యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

శ్రీరాంపూర్: అర్ధ చాతుర్మాస్య వ్రత దీక్షలు పురస్కరించుకొని గీతా సత్సంగం ఆధ్వర్యంలో గీతా హవన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఆర్కే 6కాలనీలోని గీతా ప్రశాంతి నిలయంలో సత్సంగం గురూజీ దాసరి రాజేశం ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణునికి అభిషేకం, నవగ్రహా, గణపతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు గీతా పారాయణం చేస్తుండగా పలువురు దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. పెంచికల్‌పేట పీఠాధిపతి దాసరి రాజమౌళి ఆర్య రాజయోగి భక్తులకు ధార్మికోపాన్యాసం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సత్సంగం కన్వీనర్ డీడీ ప్రసాద్, సెక్రెటరీ రాజమౌళీతో పాటు రాంబాబు, రామాదేవి, మల్లేశ్, శంకర్, సారయ్య, స్వర్ణకుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

'శాలసిద్ధి'కి సన్నద్ధం!

- పైలెట్ ప్రాజెక్టు కింద 31 పాఠశాలలు ఎంపిక
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సామర్థ్యాలు, సమ్మిళిత విద్య, ఉపాధ్యాయ వృత్తి పరమైన అభివృద్ధి పలు అంశాలు అధ్యయన మూల్యాంకనమే శాలసిద్ధి. విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే పాఠశాలల సమగ్ర స్వరూపం, బలాలు, బలహీనతలు, ఉపాధ్యాయుల సహకారం తదితర ఏడు అంశాలకు సంబంధించిన సమాచారం శాలసిద్ధికి పంపేవారు. కొన్నేళ్లుగా శాలసిద్ధిలో పొందుపరిచే వివరాలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధికి పొంతన ఉండం లేదని అధికారులు గుర్తించారు. దీంతో ఈ విద్యాసంవత్సరం నుంచి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ విద్యాసంవత్సరం పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 31 పాఠశాలలను ఎంపిక చేశారు. తొలివిడతలో జిల్లా నుంచి ఏడుగురు ప్రతినిధులు (రిసోర్సు పర్సన్)కు హైదరాబాద్‌లో శాలసిద్ధిపై శిక్షణ ఇచ్చారు. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు.

సంస్కరణలు ఇవీ...

విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి జిల్లాలో 31 పాఠశాలలు ఎంపిక చేస్తారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలను గుర్తించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చి శాలసిద్ధి వివరాలను నమోదు చేస్తారు. నవీకరించిన శాలసిద్ధిలో ఏడు డొమైన్లకు సంబంధించిన సమాచారంలో 138అంశాలకు సరిపోయే వివరాలు సేకరించి పారదర్శకంగా నమోదు చేస్తారు. న్యాస్ లేదా విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేసే వివరాల ఆధారంగా వృద్ధిని పర్యవేక్షిస్తారు. పాఠశాల డెవలప్‌మెంట్ ప్లాన్‌ను రూపొందించుకోవాల్సి ఉంటుంది. నిత్య సందర్శనిగా శాలసిద్ధి కరదీపిక అందుబాటులో ఉంచుకుని లక్ష్యాల సాధనలో అనుసరించబోయే వ్యూహాలకు అనుసంధానించుకుంటూ ఉండాలి.

జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇలా

ఈ విద్య సంవత్సరం పైలెట్ ప్రాజెక్టు కింద 11 ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 15 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ఉన్నత పాఠశాలల నుంచి ముగ్గురు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల నుంచి ఇద్దరేసి ఉపాధ్యాయులకు ఈ నెల 31, ఆగస్టు 1న శాలసిద్ధిపై శిక్షణ ఇస్తారు. శిక్షణలో కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని పాఠశాలలను అన్ని కోణాల్లో మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

శిక్షణతో ఉపాధ్యాయులకు అవగాహన

శాలసిద్ధితో వాస్తవ పరిస్థితి తెలుసుకోవటా నికి అవకాశం కలుగుతుంది. రానున్న రోజు ల్లో పాఠశాలలకు కల్పించాల్సిన సౌకర్యాలు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఏర్పా టు చేయాల్సిన శిక్షణ కార్యక్రమాలు మొదలగు అంశాలపై స్పష్టమైన అవగాహన రావటానికి దోహదపడుతుంది. గుణాత్మక లక్ష్యం రూపొందించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థుల హాజరుశాతం సరిగ్గా లేని క్రమంలో వందశాతం హాజరు లక్ష్యంగా రూపొందించుకుని ప్రణాళిక సిద్ధం చేసుకోవడం.. విద్యార్థుల తల్లిదండ్రులతో మమేకమై లక్ష్యాన్ని సాధించే విధంగా కార్యాచరణ చేపట్టాల్సి ఉంటుంది.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

నేడు సమావేశం

భీమిని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 11గంటలకు మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సబ్దర్‌ఆలీ పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.